ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 20.03.2026 సమయం. 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. 3లక్షల 24వేల 234 కోట్ల రూపాయల అంచనాతో రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ఉభయ సభల్లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది.
2. తెలంగాణను దేశంలోనే పెద్ద ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ద్వారా 5 లక్షల 75 వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు ప్రతిపాదనలు వచ్చాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.
3. సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధీ ధ్యేయంతో రాష్ట్ర బడ్జెట్ రూపుదిద్దుకుందని పలువురు మంత్రులు కొనియాడారు.
4. రాష్ట్ర బడ్జెట్ అత్యంత నిరాశాజనకంగా ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు విమర్శించారు. కాగా బడ్జెట్ అంకెల గారడిగా ఉందని బీఆర్ఎస్ శాసన సభ పక్ష ఉప నేత హరీష్ రావు ఆరోపించారు.

----------------------

**బడ్జెట్**

తెలంగాణ ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను ఈరోజు ప్రవేశపెట్టింది. శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టి ప్రసంగాన్ని ప్రారంభించారు. శాసనమండలిలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 3లక్షల 24వేల 234 కోట్ల రూపాయలతో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో రెవెన్యూ వ్యయం.. 2లక్షల 34వేల 406 కోట్ల రూపాయలు కాగా, మూలధన వ్యయం 47వేల 267 కోట్ల రూపాయలుగా ఉంది. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అంబేడ్కర్ అడుగు జాడల్లోనే పాలన సాగిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు అంతర్జాతీయ స్థాయిలో CURE, PURE, RARE అనే మూడు ప్రత్యేక ఆర్థిక మండలాలుగా గుర్తించినట్లు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న CURE ప్రాంతాన్ని సర్వీస్ సెక్టార్, టెక్నాలజీ, ఏఐ హబ్‌గా తీర్చిదిద్దుతామని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాలుష్య కారక పరిశ్రమలను తరలిస్తూ పెట్రోల్ ఆటోలను విద్యుత్ వాహనాలుగా మారుస్తామని తెలిపారు.

**బైట్ -  భట్టి - ప్యూర్, క్యూర్ రేర్**

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ ఏడాది జూన్ 2వ తేదీ నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి శ్రీకారం చుడుతున్నట్లు ఆయన వెల్లడించారు. సామాజిక అంతరాలతో సంబంధం లేకుండా పేద, ధనిక అనే తేడా చూడకుండా సుమారు 1 కోటి 15 లక్షల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల జీవిత బీమా వర్తింపజేస్తామని భట్టి విక్రమార్క తెలిపారు.

**బైట్ – భట్టి - బీమా పథకం**

తెలంగాణను దేశంలోనే ఆర్థిక శక్తిగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో సుమారు 2 వేల మంది అంతర్జాతీయ ప్రతినిధులు పెట్టుబడిదారులు, విధాన రూపకర్తలు ఆర్థిక నిపుణులు పాల్గొన్నారని ఆయన అన్నారు. 100కు పైగా ఎంఓయులు కుదుర్చుకున్నామని వీటి ద్వారా 5 లక్షల 75 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టడానికి ప్రతిపాదనలు వచ్చాయని అన్నారు.

**బైట్ – భట్టి – గ్లోబల్ సమ్మిట్**

**జీఎస్**

---------------------------------

**బడ్జెట్ లెక్కలు**

ఇంటర్ మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడంతో పాటు.. ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్‌మీడియంట్ వరకు విద్యార్థులకు అల్పాహారం అందించనున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత

ఆరోగ్య భద్రత పథకం అమలుచ చేస్తున్నట్లు.. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు అందజేయనున్నట్లు వివరించారు. ఐటీఐ, ఏటీసీల్లో చదివే విద్యార్థులకు నెలకు 2 వేల రూపాయల ఉపకారవేతనం అందిస్తామని తెలిపారు. వ్యవసాయ శాఖకు 23వేల కోట్లు, విద్యుత్ శాఖకు 21వేల 285 కోట్లు, పౌరసరఫరాల శాఖకు 7వేల 366 కోట్లు, పశుసంవర్ధక శాఖకు 1,529 కోట్లు, విద్యా శాఖకు 26వేల 674 కోట్లు, వైద్య శాఖకు 13వేల 679 కోట్లు, కార్మిక శాఖకు 998 కోట్లు, మహిళ, శిశు సంక్షేమ శాఖకు 3వేల 143 కోట్లు, పర్యాటక రంగానికి 1,224 కోట్లు, ఎస్సీ సంక్షేమానికి 11వేల 784 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి 7వేల 934 కోట్లు, బీసీ సంక్షేమానికి 12వేల 511 కోట్లు, మైనార్టీ సంక్షేమానికి 3వేల 769 కోట్లు కేటాయించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం 1500 కోట్లు కేటాయించారు. మెట్రో రైలు ఫేజ్-2 కోసం 600 కోట్లు, యంగ్ ఇండియా స్కూళ్లకు 5 వేల కోట్లు, ఆరు గ్యారంటీల అమలుకు 50వేల 713 కోట్ల రూపాయలు ప్రతిపాదించారు.

**జీఎస్**

----------------------------------

**సీతక్క బడ్జెట్**

ప్రభుత్వం ఈరోజు ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క హర్షం వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి లక్ష్యాలతో రూపుదిద్దుకున్నదిగా పేర్కొన్నారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలు, పేదల సంక్షేమానికి పెద్దపీట వేసిన ప్రజాకర్షక బడ్జెట్‌గా ఆమె అభివర్ణించారు. బడ్జెట్ ప్రసంగం అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

**డెస్క్**

----------------------------

**వాకిటి**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి హర్షం

వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు అద్దం పడుతూ, సమగ్ర అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. రైతు నుంచి విద్యార్థి వరకు, యువత నుంచి మహిళల వరకు ప్రతి వర్గాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ బడ్జెట్ కేవలం సంఖ్యల సమాహారం కాకుండా సామాజిక న్యాయం, అభివృద్ధి, సంక్షేమం కలిసిన ప్రజా బడ్జెట్ అని తెలిపారు.

**డెస్క్**

--------------------------------

**బండి సంజయ్**

రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఏ వర్గానికీ ప్రయోజనం చేకూర్చేలా లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. అంకెల ఆర్భాటాలు... కేటాయింపుల ప్రగల్భాలే తప్ప ప్రజలకు ఒరిగేందేమీ లేదని విమర్శించారు. మరో లక్ష కోట్ల రూపాయలు అదనంగా అప్పు భారం మోపేందుకు సిద్ధమవ్వడం బాధాకరమన్నారు. కేంద్రంపై ఆధారపడటం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు.

**పీటీసీ – కరీంనగర్**

-----------------------------

**రామచందర్ రావు**

ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అత్యంత నిరాశాజనకంగా ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు విమర్శించారు. ఆర్థిక మంత్రి, ఉప ముఖ్యమమంత్రి భట్టి విక్రమార్క బహుశా పొరపాటున గత ఏడాది బడ్జెట్ నే చదివారేమో అన్న అనుమానం కలుగుతోందని, ఎందుకంటే పోయినసారి బడ్జెట్ కన్నా ఇందులో పెద్దగా మార్పులు చేర్పులు ఏమీ లేవని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు దాటినా, ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందో, ఎక్కడ అభివృద్ధి జరిగిందో చెప్పుకోవడానికి ఒక్క రిజల్ట్ కూడా లేకపోవడం బాధాకరమన్నారు.

డెస్క్

---------------------------

**హరీష్ రావు**

తెలంగాణ బడ్జెట్ ను వట్టి బడ్జెట్ గా బీఆర్ఎస్ శాసన సభా పక్ష ఉప నేత హరీష్ రావు అభివర్ణించారు. అభయహస్తం కాస్తా రిక్తహస్తంగా మారిందని, అంకెల గారడీతో ప్రజలను వంచించారని ఆరోపించారు. పింఛన్ల పెంపు, రిటైర్డ్ ఉద్యోగుల ప్రయోజనాల ఊసే లేదని అన్నారు. ఆర్టీసీ, సింగరేణి కార్మికులతో పాటు ముదిరాజ్, గౌడ, గొల్ల కుర్మ వంటి బీసీ వర్గాలకు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రభుత్వం మొండిచేయి చూపిందని విమర్శించారు.

**పీటీసీ - హైదరాబాద్**

----------------------------------

**రంగనాథ్ హైడ్రా**

కష్టపడి చదువుకుని గ్రూప్ - 1 ఉద్యోగాలకు ఎంపికై పలు శాఖల్లో అధికారులుగా విధులు నిర్వహించనున్న అధికారులు తమ విభాగాల్లో ప్రత్యేకతను చాటాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. అధికారులపై ప్రజలకు నమ్మకం కలిగేలా పనులు చేయాలని, ప్రతి చర్య పారదర్శకంగా ఉండాలని అన్నారు. గ్రూప్ -1 కేడర్‌కు ఎంపికైన ఉద్యోగుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఈరోజు డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో హైడ్రా కమిషనర్ మాట్లాడుతూ.. హైడ్రా కార్యకలాపాలను వివరించారు. ఆదిలో హైడ్రా ఎదుర్కొన్న సవాళ్లను.. వాటిని అధిగమించిన తీరును తెలిపారు. హైడ్రా అంటే ప్రజల్లో పూర్తిగా అవగాహన రావడంతో తాము చేపట్టే కార్యక్రమాలకు పూర్తి స్థాయి మద్ధతు లభిస్తోందన్నారు.

**డెస్క్**

-----------------------------

**వాతావరణం**

ఈ రోజు, రేపు రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో ఉరుములు మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి

మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. రానున్న రెండు రోజులలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి నుంచి రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది.

**పీఎస్**

------------------------------

**ములుగు**

గ్యాస్ సిలిండర్ల కొరత,బ్లాక్ మార్కెట్లో అమ్మకాలు అంటూ కొన్ని మీడియాల్లో వస్తున్న వార్తల నేపథ్యంలో ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఏటూరు నాగారం మండల కేంద్రంలోని హెచ్.పీ గ్యాస్ గోదాం ను ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ బుకింగ్,సరఫరా ప్రక్రియలో ప్రజలు అవగాహనతో వ్యవహరించాలని సూచించారు. గ్యాస్ బుకింగ్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నిబంధనల ప్రకారం ప్రతి సిలిండర్ బుకింగ్‌కు మధ్య 45 రోజుల గ్యాప్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు.

**పీటీసీ - ములుగు**

--------------------------

**రాజన్న సిరిసిల్ల**

అన్ని బ్యాంకులు ప్రభుత్వ లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ సూచించారు. జిల్లాస్థాయి బ్యాంకర్స్  కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ముందుగా వ్యవసాయ, గృహ, విద్య రుణాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలు, మహిళా సంఘా లకు రుణాల పంపిణీ, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, స్వానిధి పథకాలు పక్కాగా అమలు చేయాలన్నారు.

**పీటీసీ - రాజన్న సిరిసిల్ల**

-----------------------------

**రాష్ట్ర విపత్తుల నిర్వహణ శిక్షణా కేంద్రం**

అంతర్జాతీయ ప్రమాణాలతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శిక్షణా కేంద్రం ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం సంబంధిత విభాగాల నుంచి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసుకొని కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈరోజు సచివాలయంలో విపత్తుల నిర్వహణా విభాగం, ఫైర్ సర్వీసెస్, ఎస్‌డిఆర్‌ఎఫ్, హైడ్రా, ఐసిసిసి విభాగాలతో సమీక్షలో మంత్రి మాట్లాడుతూ విపత్తులు సంభవించినప్పుడు కేవలం సహాయక చర్యలకే పరిమితం కాకుండా, ముందస్తు సన్నద్ధతతో నష్టాన్ని తగ్గించే లక్ష్యంతో 'స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్' ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

**డెస్క్**

---------------------------

**సమీక్ష**

ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా "అరైవ్ అలైవ్" కార్యక్రమంపై రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈరోజు రాష్ట్ర స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి టీఆర్‌అండ్‌బీ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ ఇలంబర్తి, డీజీపీ శివధర్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ, రవాణా, పోలీసు శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రహదారి ప్రమాదాలను తగ్గించి సురక్షిత రవాణాను నిర్ధారించే లక్ష్యంతో చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమం అమలు పురోగతిని ఈ సందర్భంగా సమీక్షించారు.

**డెస్క్**

---------------------------